# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ׀ 2 ׀ ఫిబ్రవరి ׀ 2024






**రిజిస్ట్రేషన్ పాట్లు**

పాల్వంచ అభివృద్ధికి రిజిస్ట్రేషన్ల సమస్య అడ్డంకిగా మారింది. మెయిన్ రోడ్ మినహా పలు ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది. IIలో



**జేఎల్ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి**

జూనియర్ లైన్‌మెన్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 23 మందిలో కొందరే స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. IIలో

**వాతావరణం**

గరిష్టం / కనిష్టం 34°/ 18°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలిగాలుల ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### రమణీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**గోశాలలో ప్రత్యేక పూజలు**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామంలో నిర్మిస్తున్న గోశాలలో స్టోర్, వసతి గదులకు గురువారం పూజలుజరిపారు. ఆలయ ఈఓ రమాదేవి అర్చకుల మంత్రోచ్చరణల నడుమ గదులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు పలువురు దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన జరిపారు. ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, కమిటీ సభ్యులు గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఈనెల 8న రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఐఈఓ సులోచనారాణి

కొత్తగూడెంఅర్బన్ : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలోని పలు కళాశాలల్లో గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి పలు కళాశాలల్లో పరీక్షలను తనిఖీ చేశారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 398 మందికి గాను 383 మంది పరీక్షలకు హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 1,221 మందికి 1158 మంది హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారు.

### ముగిసిన జేఈఈ మెయిన్స్




అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సుజాతనగర్ : స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు ఉదయం విడతలో 131 మందికి గాను 128 మంది, మధ్యాహ్నం విడతలో 129 మంది హాజరయ్యారని, రెండు విడతల్లో కలిపి ఐదుగురు గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. కాగా, ఈ కళాశాలలో శని, ఆదివారాల్లో గేట్ పరీక్షలు జరగనున్నాయి.

# ఆశల పల్లకీలో..

కేంద్రం ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారానికి పెద్ద పీట వేశారు. అలాగే విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు సోలార్ రూఫ్ టాప్‌లకు సంబంధించి కొత్త పథకం అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. వీటితో పాటు పర్యాటక రంగానికి పెద్ద పీట వేయగా, తృతీయ శ్రేణి నగరాల్లో విమానాశ్రయాల ఏర్పాటుపై దృష్టి సారిస్తామని చెప్పారు. దీంతో భద్రాచలం వంటి ఆధ్యాత్మిక క్షేత్రం, కిన్నెరసాని వంటి ప్రకృతి అందాలు, దట్టమైన అడవులతో సమీపంలో పాపికొండలు తదితర పర్యాటక ప్రాంతాలు ఉన్న భద్రాద్రి జిల్లాకు టూరిజంలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. అయితే ఈ అవకాశాలను ఎంతవరకు అందిపుచ్చుకుంటారనేది ప్రస్తుతం ఉన్న, రాబోయే ఎంపీలపై ఆధారపడి ఉంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం




**కేంద్ర బడ్జెట్‌లో పర్యాటక రంగానికి పెద్దపీట**

- ఎంపీలు శ్రమిస్తే కొత్తగూడెం ఎయిర్‌పోర్టు కల సాకారం
- రైల్వే ప్రాజెక్టులకు అరకొర నిధులే కేటాయింపు
- జిల్లాకు 'నమో భారత్' వచ్చేనా ?

**ఎంపీలు ప్రయత్నిస్తేనే..**

దేశమంతా రామనామ స్మరణతో మార్మోగుతోంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికి భక్తుల తాకిడి పెరిగింది. అయితే రద్దీకి తగ్గట్టుగా ఇక్కడ ఏర్పాట్లు లేవు. ఇప్పుడున్న సౌకర్యాలు శ్రీరామనవమి, ముక్కోటి వంటి ఉత్సవాలకే ఎటూ చాలడం లేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రసాద్ పథకం ద్వారా భద్రాచలంలో రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇక్కడికి వచ్చిన భక్తులు శ్రీరాముడి దర్శనం తర్వాత సమీపంలోని పర్ణశాల, పాపికొండలు, కిన్నెరసాని అభయారణ్యం తదితర ప్రాంతాలను చుట్టి వచ్చేలా ప్యాకేజీలు ప్రకటించాల్సిన అవసరం ఉంది. అలాగే పెరిగే రద్దీకి అనుగుణంగా బస, వసతి, స్నానాలు, టాయిలెట్లు తదితర కనీస సౌకర్యాలు విస్తృతంగా పెంచాల్సి ఉంది. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో పర్యాటక రంగానికి పెద్ద పీట వేసిందున నిధులు తెచ్చుకునేలా ప్రణాళిక రూపొందించుకుని మంజూరు చేయించుకునే వరకు కార్యాచరణ సిద్ధం చేయాల్సిన బాధ్యత ఎంపీలపై ఉంటుంది.

**అరకొర నిధులే..**

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రైల్వే ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత రాలేదు. జిల్లాకు సంబంధించి భద్రాచలంరోడ్ – మణుగూరు, భద్రాచలం – జైపూర్, కొత్తగూడెం – కిరండోల్, కొత్తగూడెం – కొండపల్లి, భద్రాచలంరోడ్ – కొవ్వూరు వంటి రైల్వేలైన్లు సర్వేలు పూర్తయి నిధుల విడుదల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇందులో మణుగూరు – రామగుండం, భద్రాచలం – జైపూర్ (ఒడిశా) రైల్వే లైన్లు సత్వరమే చేపట్టాలని రైల్వేశాఖ గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు ఫైనల్ లోకేషన్ సర్వేకు మూడు నెలల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ ఈ బడ్జెట్‌లో ఈ రైల్వేలైన్లకు అరకొర నిధులే కేటాయించారు. ఇక డోర్నకల్ – భద్రాచలంరోడ్ డబ్లింగ్ పనులదీ ఇదే పరిస్థితి.

**విమానం ఎగిరేనా..?**

ప్రస్తుత బడ్జెట్‌లో తృతీయశ్రేణి నగరాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం సానుకూలగా ఉందని మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. ఇప్పటికే 20/40 సీటర్ విమానాల తయారీపై ఏవియేషన్‌లోని దిగ్గజ సంస్థలు ఫోకస్ చేశాయి. ప్రస్తుతం తెలంగాణలో ఒక్క హైదరాబాద్‌లోనే ఎయిర్‌పోర్ట్ ఉంది. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనే ప్రతిపాదన గత ఇరవై ఏళ్లుగా కాగితాలకే పరిమితమైంది. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల దుమ్ము దులిపితే ఎయిర్‌పోర్ట్ నిర్మాణం విషయంలో సానుకూల నిర్ణయాలు వెలువడేందుకు ఆస్కారం ఉంది. విమానయానం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ఊతం ఇచ్చే అవకాశం కలుగుతుంది.

**కొత్త రైళ్లు రావాలి..**

రాబోయే రోజుల్లో వందేభారత్ / నమోభారత్ పేరుతో సరికొత్త రైళ్లను పెద్ద ఎత్తున ప్రవేశపెడతామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే భద్రాచలంరోడ్ నుంచి నడిచే అనేక రైళ్లు కరోనా కాలంలో రద్దయ్యాయి. ఇందులో మణుగూరు – కాజీపేట, భద్రాచలంరోడ్ – డోర్నకల్ రైళ్లను పునరుద్ధరించలేదు. మణుగూరు – బెళగావి రైలును కొద్దికాలం నడిపించి కాజీపేట – మణుగూరు మధ్య మళ్లీ రద్దు చేశారు. ఈ రైళ్లను తిరిగి ప్రవేశపెట్టాలనే డిమాండ్‌పై బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన రాలేదు. అలాగే భద్రాచలం రోడ్ స్టేషన్ నుంచి తిరుపతి, షిర్డీ వంటి పుణ్యక్షేత్రాలకు నమోభారత్ వంటి రైళ్లను నడిపించాలనే డిమాండ్ భక్తుల నుంచి ఉంది. రాబోయే రోజుల్లో ఈ డిమాండ్ ఎంత మేరకు సఫలం అవుతుందనేది వేచిచూడాల్సిందే.

**ఇది ఎన్నికల బడ్జెట్**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పూర్తిగా ఎన్నికల బడ్జెట్. ఇది కొత్తసీసాలో పాతసారా మాదిరిగానే ఉంది. ఇందులో రూ.7లక్షల వరకు టాక్స్ ఫ్రీ అనే విషయం పాతదే. కొత్త విధానం ఏంటో కేంద్రమే ప్రకటించాలి. బడ్జెట్ అంటే రైతులకు, పేదలకు ఉపయోగకరంగా ఉండాలి.

– రేగా కాంతారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

**ప్రజారంజక బడ్జెట్**




ఇది సామాన్యుడి, ప్రజారంజక బడ్జెట్. దీనిద్వారా అన్ని వర్గాలకూ మేలు జరుగుతుంది. ముఖ్యంగా నిరుపేదలు తినేందుకు తక్కువ ధరకు బియ్యం అందించడమనేది గొప్ప నిర్ణయం. ఈ విషయాన్ని ప్రజలంతా హర్షిస్తున్నారు. బడ్జెట్‌లో అన్ని రంగాలకూ పెద్దపీట వేశారు.

– కె.వి.రంగాకిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

# బీఆర్‌ఎస్ భేటీలు..

- రేపు జిల్లాకు హరీశ్‌రావు. 4న కేటీఆర్ రాక..
- 3వ తేదీన భద్రాచలం, మణుగూరులో సమీక్ష
- ఆతర్వాత రోజు వైరా, ఖమ్మంలో నేతలతో కేటీఆర్ సమావేశం
- పార్లమెంట్ ఎన్నికలకు దిశా నిర్దేశం చేసేలా ప్రణాళిక




సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్‌ఎస్ సమాయత్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భంగపాటుకు గురైన ఆ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాలను దక్కించుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈనేపథ్యాన 3, 4 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 3 తేదీన జరిగే సమీక్షలకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, 4వ తేదీన జరిగే భేటీలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారు. ఈసందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తదితరులు పాల్గొంటారు.

**గట్టెక్కేదెలా?**

ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను బీఆర్‌ఎస్‌కు భద్రాచలం స్థానం మాత్రమే దక్కింది. 2014, 2018 ఎన్నికల్లోనూ ఒక్కో స్థానంతోనే సరిపెట్టుకున్నా.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం స్థానాన్ని, ఉమ్మడి జిల్లా ప్రాతినిధ్యంతో మహబూబాబాద్ స్థానంలోనూ జెండా ఎగురవేసింది. దీంతో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకుంటామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేసినప్పటికీ అలా జరగకపోగా రాష్ట్రంలోనూ అధికారంలోకి రాలేదు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో నెగ్గడం ఆ పార్టీకి కత్తి మీద సాములా మారిందని చెప్పొచ్చు. ఇటు మహబూబాబాద్ ఎంపీగా మాలోతు కవిత, ఖమ్మం ఎంపీగా నామ నాగేశ్వరరావు సిట్టింగ్‌గా ఉండటంతో ఆయా స్థానాల్లో మళ్లీ గట్టెక్కేదెలా అని ముఖ్యనేతలు ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా తెలంగాణ భవన్‌లో ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తూ పార్టీ శ్రేణులను లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు జిల్లాల బాట పడుతున్నారు.

**భద్రాచలంలో మొదలు**

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భద్రాచలం, ఇల్లెందు, పినపాక, మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం మినహా మిగతా అన్నిచోట్లా కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఇక ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఉండగా అన్నిచోట్లా బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ వ్యత్యాసంతో ఓటమి పాలయ్యారు. ఈ ఓట్లను లెక్కలోకి తీసుకుంటే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ పార్టీ విజయ తీరాలకు చేరడం కష్టమని రాజకీయంగా విశ్లేషణ జరుగుతోంది. అయితే గత ఎన్నికల్లో ఓటమికి దారితీసిన కారణాలు, పార్లమెంట్ ఎన్నికల్లో విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై నియోజకవర్గాల వారీగా ఇప్పటినుంచే రంగంలోకి దిగితే ఆశించిన ఫలితం వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే శనివారం ఉదయం భద్రాచలంలో, మధ్యాహ్నం పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మణుగూరులో నిర్వహిస్తుండగా ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారు. ఇక ఆదివారం ఉదయం వైరా, మధ్యాహ్నం ఖమ్మంలో జరిగే సమావేశాలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. కాగా, ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలయ్యే సమావేశానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, కేడర్ హాజరుకావాలని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. ఈ సమావేశాల తర్వాత మిగతా నియోజకవర్గాల్లోనూ దశల వారీగా భేటీలు జరుగుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# వైవిధ్యంగా గిరిజనుల సంప్రదాయాలు



బృందం సభ్యులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీ ఏరియాలోని ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలి వైవిధ్యమైనవని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. కేంద్రప్రభుత్వ పరిశోధన సంస్థ, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సభ్యులు ఆదివాసీలపై సర్వే కోసం భద్రాచలం ఏజెన్సీకి వచ్చారు. ఈ సందర్భంగా వారు గురువారం పీఓను కలవగా... ఆయన మాట్లాడారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించటానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా అనేక పథకాలు అమలుచేస్తోందని, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడుతోందని తెలిపారు. అనంతరం సర్వే సంస్థ జగదల్పూర్ అధికారి డాక్టర్ పీ.ఎస్.రంగసాదు మాట్లాడుతూ తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లోని గిరిజన ప్రజల జీవనశైలి, సంస్కృతిపై పరిశోధన చేశామన్నారు. గతనెల 17 నుంచి 31 వరకు 12 గ్రామాల్లో పర్యటించగా అందరూ సహకరించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు అలివేలు మంగతాయారు, వీరస్వామి, అనుపమ్ దత్తా, రాంబాబు, మౌనికాదేవి, డాక్టర్ లికె చంద్రజోల్, ప్రాంజలి రామ్ టేకి, రిషి కొల్వన్ రైస్, కోసం రత్నాకర్ప్రలే, సంజనేర్ బేరా తదితరులు పాల్గొన్నారు.

**నర్సరీల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం**

భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్ఎస్‌టీసీ నర్సరీ, గరిమెళ్లపాడు, ప్రశాంత్‌నగర్ జీపీలతో పాటు చుంచుపల్లి మండలంలో నర్సరీల్లో నాటిన చెట్ల సంరక్షణ, ఫలసాయం పొందుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ నర్సరీల్లో మామిడి తోటలు 882, సపోటా 66, నిమ్మ 87, కొబ్బరి 149 చెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటల లోపు తమ కార్యాలయంలో టెండర్లు అందజేయాలని సూచించారు.

# కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడిగా శివరామకృష్ణ

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం అధికారులు, సాంకేతిక ఉద్యోగుల కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడిగా కె.శివరామకృష్ణ ఎన్నికయ్యారు. గౌతమీనగర్ కాలనీలోని సంఘం కార్యాలయంలో గురువారం ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.శ్రావణ్‌కుమార్, కార్యదర్శిగా సోమేశ్వర్, కోశాధికారిగా వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, నాయకులు రవీందర్, వేణుగోపాల్, పెంటి సురేష్, నాగభూషణం అభినందనలు తెలిపారు.

# వంద శాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థి సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈఓ

చర్లరూరల్/దుమ్ముగూడెం : పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. చర్ల, దుమ్ముగూడెం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధనపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలని, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలని అన్నారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. దుమ్ముగూడెం మండలం నరసాపురంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి – ఆదిలక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణ, దాతల సహాయంతో అల్పాహారం అందిస్తున్న విధానాన్ని ప్రధానోపాధ్యాయుడు డీఈఓకు వివరించారు. కార్యక్రమంలో చర్ల ఎంఈఓ జుంకిలాల్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి బాటలో పల్లెలు..

- గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల పెద్దపీట
- ఐదేళ్లలో రూపురేఖలు మారిన పల్లెలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు



జాతీయస్థాయిలో అవార్డు పొందిన గౌతంపూర్ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పులు తెచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక పల్లెప్రగతి కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. 2019 నుంచి ప్రతీ పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించడంతో అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెరిగింది. పారిశుద్ధ్య చర్యలతో పాటు పచ్చదనం మెరుగుపడింది. హరితహారం పథకంతో పచ్చదనం పెరిగింది. పల్లె ప్రగతి కింద ప్రభుత్వం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి భరోసాగా నిలిచాయి. పలుచోట్ల రహదారులు మెరుగుపడ్డాయి. ఈ ఐదేళ్లలో సర్పంచ్‌లు ఎక్కువ మంది విద్యావంతులు కావడంతో పాలనపై అవగాహన పెంచుకుంటూ పల్లెల అభివృద్ధికి మరింతగా కృషి చేశారు.

**పట్టణాలకు దీటుగా..**

జిల్లాలో 481 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2019 జనవరిలో 479 జీపీలకు ఎన్నికలు నిర్వహించగా ఫిబ్రవరి 2న కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా జిల్లాలో 1,280 పల్లె ప్రకృతి వనాలు, 480 డంపింగ్ యార్డులు, 481 వైకుంఠధామాలు, 481 హరిత నర్సరీలు, 670 చోట్ల క్రీడా ప్రాంగణాలు, 104 బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఐదుసార్లు నిర్వహించిన పల్లె ప్రగతిలో గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగుకాల్వల శుభ్రత, శిథిల భవనాల తొలగింపు, పనికిరాని బావుల పూడ్చివేత, పిచ్చి మొక్కల తొలగింపు, రహదారులపై గుంతల పూడ్చివేత, మొక్కల పెంపకం, నర్సరీలు, తడి, పొడి చెత్త నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్ సమస్య పరిష్కారంతో పాటు సీసీ రోడ్లతో పల్లెలు మెరుగైన ప్రగతి సాధించాయి. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలకు ప్రతి నెల రూ.10.32 కోట్లు చొప్పున విడుదల కావడంతో అవి స్థానిక అవసరాలకు ఉపయోగపడ్డాయి. పల్లెప్రగతిలో భాగంగా 2021లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రత్యేక స్థానం దక్కింది. పారిశుద్ధ్యం, పచ్చదనం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఇంటి పన్నుల వసూళ్లు, డంపింగ్‌యార్డుల నిర్వాహణ వంటి మొత్తం ఆరు అంశాల్లో రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా ఉత్తమంగా నిలిచింది. ఇక జాతీయస్థాయిలోనూ గౌతంపూర్, జగన్నాథపురం గ్రామ పంచాయతీలు ఉత్తమ అవార్డులు సాధించాయి.

**నేటి నుంచి 'ప్రత్యేక' పాలన**


గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం గురువారంతో ముగియగా, శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రానుంది. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలకు పూర్తిస్థాయిలో గెజిటెడ్ హోదా కలిగిన అధికారులనే స్పెషలాఫీసర్లుగా నియమించారు. జిల్లాలో 220 మంది గెజిటెడ్ అధికారులను నియమించగా ఒక్కొక్కరు రెండు, మూడు పంచాయతీల బాధ్యతలను చూడాల్సి ఉంటుంది. నాన్ గెజిటెడ్ అధికారులను తీసుకోవాలని మొదట భావించినా ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం వారికి మినహాయింపు ఇచ్చారు. జిల్లా, మండల స్థాయిలో పనిచేస్తున్న గెజిటెడ్ ఉద్యోగుల హోదాను బట్టి స్పెషలాఫీసర్ల జాబితా రూపొందించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, మున్సిపల్ ఏఈలు, వ్యవసాయ శాఖ ఏఈఓలు, డీఆర్‌డీఏ, వైద్యారోగ్యశాఖ, ఉద్యానవన, పశుసంవర్థక, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలకు గ్రామాల బాధ్యతలు అప్పగించారు.

**ప్రత్యేకాధికారుల నియామకం**

**ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్**

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులు కేటాయించిన ప్రత్యేకాధికారులు తక్షణమే సంబంధిత గ్రామపంచాయతీల బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. స్పెషలాఫీసర్లు బాధ్యతలు స్వీకరించగానే ఆయా ఎంపీడీఓలు, ఎంపీఓలు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి గ్రామ పంచాయితీల పాలన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుందని పేర్కొన్నారు.

**అభివృద్ధిపథంలో గ్రామాలు**



ఐదేళ్ల సర్పంచ్‌ల పాలనలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాట పట్టాయి. ఐదు విడతల్లో చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా పంచాయతీల్లో ప్రధాన సమస్యలు పరిష్కారం అయ్యాయి. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రతీ నెల జిల్లాకు వచ్చే ఆర్థిక సంఘం నిధులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడుతున్నాయి. ఈ ఐదేళ్లలో సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే గ్రామాల్లో సమగ్రాభివృద్ధి చెందాయి.

– రమాకాంత్, డీపీఓ

## క్లుప్తంగా

### రామాలయంలో భద్రతా సిబ్బందికి బదిలీలు?

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో భద్రత విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆలయ ఈఓ రమాదేవి దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు సమాచారం. పట్టణ సీఐకి, ఆలయ ఈఓ రమాదేవికి మధ్య కొద్ది రోజుల క్రితం జరిగిన వివాదమే అంతర్గత బదిలీలకు కారణమనే ప్రచారం జరుగుతోంది.

### రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాల పంపిణీ

పాల్వంచ రూరల్: మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం 'బాలల కోసం-రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ సరస్వతి, సర్పంచ్, ఎంపీటీసీ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, పుల్లారెడ్డి, రమణకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటాం

సింగరేణి ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ మోహన్‌రావు

ఇల్లెందు: సింగరేణి హైస్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు ఉంటాయని సింగరేణి ఎడ్యుకేషన్ కరస్పాండెంట్, డీజీఎం(పర్సనల్) జీవీ మోహన్‌రావు తెలిపారు. గురువారం విద్యార్థినుల తల్లిదండ్రులు ఆయన్ను కలవగా వివరాలు వెల్లడించారు. గత నెల 21న తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, ప్రాథమిక విచారణ ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని తెలిపారు. పాఠశాలలో నలుగురు మహిళా ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేశామని, బాలికలకు రక్షణగా ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. సున్నిత విషయం కావటంతో శాఖాపరమైన చర్యలకే పరిమితం చేశామని తెలిపారు.

### కేటీపీఎస్ ఉద్యోగి అదృశ్యం

పాల్వంచ: కేటీపీఎస్ ఉద్యోగి అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేటీపీఎస్‌లో జూనియర్ ప్లాంట్ అటెండెంట్‌గా విధులు నిర్వహించే ఎస్.వేణు కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 31న ఇంట్లో నుంచి బైక్ తీసుకుని వెళ్లాడు. తిరిగి రానని సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ పంపించాడు. భార్య సుజన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నూకల లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

పాల్వంచ: లారీలో తరలిస్తున్న నూకలను పాల్వంచ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందిగామకు లారీలో తరలిస్తున్న నూకలను ఎస్‌ఐ రాఘవేందర్ రావు పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, శాంపిళ్లను సివిల్ సప్లై అధికారులకు పంపించారు. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ బి.రామును వివరణ కోరగా.. సివిల్ సప్లై అధికారుల నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### రూ.13 లక్షలు స్వాహా

అధిక సంపాదన పేరుతో మభ్యపెట్టిన సైబర్ నేరగాళ్లు

పాల్వంచ: పార్ట్‌టైం ఉద్యోగం చేసి అధికంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ చూపి సైబర్ నేరగాళ్లు భారీగా నగదు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నవభారత్‌కు చెందిన తేజావత్ వెంకటేష్ కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ బ్యాంక్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పార్ట్‌టైంగా ఉద్యోగం చేస్తూ డబ్బులు సంపాదించుకోవచ్చంటూ ఇటీవల ఓ లింక్ అతని సెల్‌ఫోన్‌కు వచ్చింది. దీంతో వెంకటేష్ వారి అకౌంట్‌కు పెట్టుబడి కింద విడతల వారీగా రూ.13,35,260 నగదు పంపించాడు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం టోల్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు


పెనుబల్లి: మండలంలోని వీఎం బంజర్ రింగ్ సెంటర్ సమీపాన ఆగి ఉన్న కారును అదే మార్గంలో సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న మరో కారు ఢీకొట్టింది. దీంతో ఆగి ఉన్న కారులో కూర్చొన్న తన్నీరు శ్రీను, యర్రగొర్ల కవితకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కేఎం బంజర్, పార్థసారధీపురం గ్రామానికి చెందిన వీరు గురువారం చిన్నపిల్ల లతో కారులో వెళ్తూ వీఎం బంజర సెంటర్‌లో ఆగగా ప్రమాదం జరిగింది. ఘటనలో గాయపడిన శ్రీను, కవితను పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు కోసం వీఎం బంజర్ పోలీసులు గాలింపు చేపట్టారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.12,448 |

# రిజిస్ట్రేషన్ పాట్లు



పాల్వంచలో రిజిస్ట్రేషన్లు లేని సర్వే నంబర్ 817 ఏరియా

## పాల్వంచ పట్టణంలో కుంటుపడుతున్న అభివృద్ధి

- మున్సిపాలిటీలోని పలు సర్వే నంబర్లలో సమస్య
- 2016 నుంచి భూ యజమానులకు ఇబ్బందులు
- మరోపక్క ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణాభివృద్ధికి రిజిస్ట్రేషన్ల సమస్య ఆటంకంగా మారింది. ప్రధాన రహదారి మినహా ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడింది. మున్సిపాలిటీలోని సగం సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్‌లు లేవు. దీంతో భూ, గృహ క్రయవిక్రయాలు అరకొరగా నడుస్తున్నాయి. 2016 సంవత్సరం నుంచి 999, 817, 444, 727, 405, 999 సర్వే నంబర్లలో అసైన్డ్ మెంట్ భూముల పేరుతో రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయగా, ప్రభుత్వ బ్యాంక్‌లలో రుణాలు సైతం ఇవ్వడం లేదు. దీంతో ప్రైవేట్ బ్యాంక్‌ల ద్వారానే గృహ నిర్మాణ, కొనుగోలు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్‌లు సాగకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

**బ్యాంక్ రుణాలు రాక.. సొంతింటి కల నెరవేరక**

జిల్లా పారిశ్రామిక ప్రాంతమైనప్పటికీ చాలా వరకు భూభాగం ఏజెన్సీతో ముడిపడి ఉంది. ఇక కొన్ని ప్రాంతాలు సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, ఐటీసీ, హెవీవాటర్ ప్లాంట్, నవభారత్ వంటి కర్మాగారాలకు చెందిన భూములు, ఎండోమెంట్ శాఖ, అటవీ శాఖ భూములు అధికంగా ఉన్నాయి. ఇక నాన్ ఏజెన్సీ భూభాగం తక్కువనే చెప్పాలి. పేరుకే ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీలు అయినా ఇక్కడి భూములకు సర్వ హక్కులు లేని పరిస్థితి. జిల్లా కేంద్రం అయిన కొత్తగూడెం పక్కనే ఉన్న పాల్వంచ పట్టణాల్లో రిజిస్ట్రేషన్‌ల సమస్య కొన్నేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తోంది. సర్వే నంబర్ 999 (పేటచెరువు, పిల్ల వాగు, కొత్తూరు, బంగారుజాల), 817(శివనగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, కాంట్రాక్టర్స్ కాలనీ, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, ఇంద్రాకాలనీ), 444(కలెక్టరేట్ ఎదురు ప్రాంతం, నవభారత్ ఏరియా), 405(నవభారత్, కేఎస్ఎం ఏరియా), 727(ప్రశాంత్ కాలనీ, వెంగళరావు కాలనీ) తదితర ఏరియాల్లో రిజిస్ట్రేషన్లను 2016 నుంచి ఆపివేశారు. దీంతో బ్యాంక్ రుణాలు నిలిచిపోయాయి. ఉద్యోగులు బ్యాంక్ ఈఎంఐల ద్వారానే గృహాలు కొనుగోళ్లు చేస్తుంటారు. వీరికి ఈ భూములు ఎంతో అనువైనప్పటికీ రుణాలు రాని కారణంగా కొనలేకపోతున్నారు. బయట అప్పు చేసి కొంటే వడ్డీ రేట్లు అధికంగా ఉంటున్నాయి. దీంతో ఇతర పట్టణాలు, నగరాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. హైదరాబాద్, ఖమ్మం నగరాలకు వలస వెళ్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం మూతబడటంతో సుమారు 2 వేల మంది ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఈ కారణాలతో అభివృద్ధి స్తంభించిపోయింది.

### మందగించిన క్రయవిక్రయాలు

పాల్వంచలో సగభాగం విస్తరించి ఉన్న ఈ ఐదు నంబర్లలో రిజిస్ట్రేషన్లు లేక భూక్రయ విక్రయాలు మందగించాయి. అవసరానికి ఆస్తిగా ఉన్న భూమిని అమ్మి పెళ్లిళ్లు, ఆస్పత్రి అవసరాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో అమ్మకాలు చేయాలంటే రిజిస్ట్రేషన్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక స్థలాలు, ఇళ్ల ధరలు సైతం తగ్గిపోయాయి. ఈ భూములకు దశాబ్దాలకాలంపాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ల జరగడంతో పెద్ద పెద్ద భవనాలతో ఎంతో అభివృద్ధి చెందగా గత ఎనిమిదేళ్లుగా ఈ ఏరియాల్లో అభివృద్ధి కుంటుపడింది. మిగతా చోట్ల రిజిస్ట్రేషన్లు ఉండటంతో శరవేగంగా విస్తరణ జరుగుతోంది. ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా ఎన్నికల ప్రచారంలో ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను తిరిగి పునఃరుద్ధరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చాలని పట్టణవాసులు కోరుతున్నారు.

# భర్త ఎస్సై.. భార్య నర్సింగ్ ఆఫీసర్



ఉషారాణి

అశ్వారావుపేటరూరల్: భర్త ఎస్సైగా ఎంపికై శిక్షణ పొందుతుండగా భార్య నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. మండలంలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన ఏలేటి ఉషారాణి రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన ఫలితాల్లో నర్సింగ్ ఆఫీసర్ కొలువు సాధించింది. గురువారం ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఉషారాణి తండ్రి భూషణం కొన్నేళ్లుగా అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్మికుడి(చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్‌కు డ్రైవర్)గా పని చేస్తున్నాడు. తల్లి పార్వతి వ్యవసాయ కూలీగా పని చేస్తోంది. దంపతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని కూతురు ఉషారాణిని చదివించగా, ఎంఎస్సీ సైకియాట్రీ పూర్తిచేసింది. కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో కేన్సర్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె తాజాగా నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని సాధించారు. ఉషారాణి భర్త గద్దల అశోక్ కుమార్ కూడా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో పోలీస్ శాఖలో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కొద్ది రోజులుగా తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. భార్యాభర్తలు ప్రభుత్వ కొలువులను సాధించడం పట్ల పలువురు అభినందించారు.

### నర్సింగ్ ఆఫీసర్‌గా మౌనిక



మౌనిక

టేకులపల్లి: తెలంగాణ ప్రభుత్వం నియమించిన నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగాల్లో టేకులపల్లి మండలానికి చెందిన గిరిజన యువతికి ఉద్యోగం లభించింది. తడికలపూడి పంచాయతీ కోక్యాతండాకు చెందిన బాణోతు రాములు, రజియా దంపతుల కుమార్తె మౌనిక ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని నర్సింగ్ ఆఫీసర్‌గా ఎంపికైంది. శుక్రవారం కొత్తగూడెంలో నర్సింగ్ ఆఫీసర్‌గా విధుల్లో చేరనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మౌనికకు ఉద్యోగం రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### భారీగా గంజాయి సీజ్!

కొత్తగూడెంఅర్బన్: సినీఫక్కీలో చేజింగ్ చేసి టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు పోలీసులను చూసి వేగంగా ఇల్లెందు క్రాస్ రోడ్డు దాటి కొత్తగూడెం పట్టణం వైపు దూసుకెళ్లింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడిస్తూనే త్రీటౌన్, చుంచుపల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. కాగా త్రీటౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఏరియాలో భారీ గంజాయితో ఉన్న వాహనాన్ని పట్టుకున్నట్లు సమాచారం. అక్రమ గంజాయి రవాణావెనుక పలువురి హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులు విచారణ మొదలుపెట్టారు. అయితే అధికారిక ప్రకటన వెలువరించలేదు. ఇటీవల కాలంలో జిల్లాలోని పలు చోట్ల భారీగా గంజాయి పట్టుబడుతోంది. వరుసగా గంజాయి పట్టుబడటంతో దందా వెనుక ఉన్న వారిపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కాగా జిల్లా పోలీసు అధికారులు శుక్రవారం అధికారికంగా గంజాయి వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇంద్రవెల్లిలో మరో రెండు గ్యారంటీలు

- మా ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తుంది
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఎన్నికలకు ముందు తాము ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మరో రెండింటి అమలుపై శుక్రవారం జరిగే ఇంద్రవెల్లి సభలో ప్రకటన చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇది ప్రజల పక్షాన పని చేసే ప్రభుత్వమని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నుంచి తన గెలుపు, కాంగ్రెస్ విజయాన్ని కాంక్షిస్తూ మద్దతు ఇవ్వడంపై మంత్రి గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ, టీడీపీ జిల్లా కార్యాలయాలకు వెళ్లారు. ప్రజాపంథా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీపీఐ కార్యాలయంలో బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వాన్ని అందరి సహకారంతో గద్దె దించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. తన విజయానికి సహకరించిన వారు అసెంబ్లీ ఎన్నికల వరకే పరిమితం కాకుండా భవిష్యత్‌లోనూ కలిసి పనిచేయాలన్నారు. కాగా, టీడీపీ కార్యాలయంలో దివంగత సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పొంగులేటి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమల్లో ప్రజాపంథా, సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, వి.మనోహర్‌రాజు, పుసులూరి నరేంద్ర, సీవై.పుల్లయ్య, ఆవుల అశోక్, దండి సురేష్, మౌలానా, జానీమియా, రాయల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, తుక్కాని బ్రహ్మయ్య, ఎండీ.జావేద్, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, తుంబూరు దయాకర్‌రెడ్డి, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, కొండబాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి పొంగులేటి నగరంలోని కాంగ్రెస్ నాయకుడు రాయల నాగేశ్వరరావు ఇంటికి కూడావెళ్లి గత ఎన్నికల్లో తన విజయానికి సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

# జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి

- ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది అభ్యర్థుల హాజరు
- సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహణ



స్తంభం ఎక్కుతున్న జేఎల్‌ఎం అభ్యర్థి

ఖమ్మంవ్యవసాయం: జూనియర్ లైన్‌మెన్ల మూడో దశ ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు గురువారం ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో పరీక్ష నిర్వహించారు. 2019వ సంవత్సరంలో జూనియర్ లైన్‌మెన్ల పోస్టులకు రాతపరీక్ష నిర్వహించగా మూడో దశలో 23 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరి సర్టిఫికెట్లను గురువారం పరిశీలించి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించిన 23 మందిలో 20మంది హాజరుకాగా, కొందరు మాత్రం స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్ష పరిశీలకుడిగా వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఈ అశోక్ వ్యవహరించగా ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్, డీఈలు బాబూరావు, నాగేశ్వరరావు, జిలానీపాషా తదితరులు పర్యవేక్షించారు. కాగా, పరీక్ష నిర్వహిస్తుండగా ఆన్‌లైన్ విధానంలో హనుమకొండ నుంచి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పరిశీలించారు. కాగా, అభ్యర్థుల వివరాలను సీఎండీకి సమర్పించనుండగా, ఎంపిక చేసే అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది.

# రక్షణతో కూడిన విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆనంద్‌వేలు, పక్కన అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రతీ ఉద్యోగి రక్షణతో కూడిన విధులు నిర్వహించాలని, లాగౌట్, ట్యాగ్ ఔట్‌లను తప్పకుండా వినియోగించాలని సింగరేణి సౌత్ సెంట్రల్ జోన్ డీఎంఎస్ ఎస్.ఆనంద్‌వేలు అన్నారు. గురువారం ఆయన కొత్తగూడెం జీఎం కార్యాలయంలో ఇంజనీర్లు, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ పనులు చేసే సమయంలో అజాగ్రత్తగా ఉండొద్దని సూచించారు. బ్యాటరీ లైఫ్, ఎక్స్‌పైరీ డేట్, పనితీరు వంటి వివరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే వారు రక్షణతో పనిచేయడంతో పాటు తోటి ఉద్యోగులను కూడా రక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో సేఫ్టీ జీఎం కె.గురవయ్య, ఏరియా జీఎం శాలేంరాజు, ఎస్వో టూ జీఎం కోటిరెడ్డి, ఏరియా రక్షణాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండు కలప దుంగలు సీజ్

సాక్షి ఎఫెక్ట్..



వైల్డ్‌లైఫ్ అధికారులు పట్టుకున్న కలప దుంగ

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పాలవాగు గ్రామంలో పాల్వంచ వైల్డ్‌లైఫ్ పరిధిలో గురువారం మరో రెండు కలప దుంగలను వైల్డ్‌లైఫ్ అధికారులు పట్టుకున్నారు. గ్రామ సమీపంలో వైల్డ్‌లైఫ్ ప్రాంతంలో చెట్లు నరికివేత, కలప దుంగల స్థావరాలపై రెండు రోజులుగా 'సాక్షి'లో కథనాలు ప్రచురితమవుతున్న సంగతి తెలిసిందే. గురువారం పొలాల్లో దాచిన రెండు దుంగలను వెతికి పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. గురువారం వైల్డ్‌లైఫ్ సెక్షన్ ఆఫీసర్ హారిక, ఇన్‌చార్జ్ బీట్ ఆఫీసర్ జోగేష్ తదితరులు చెట్లు నరికివేత, కలప దుంగలు దాచి ఉంచిన స్థావరాలపై విచారణ చేపట్టారు. కలప దుంగలు ఎక్కడ నరికారు? ఎన్ని చెట్లు నరికారు? కారకులు ఎవరు? పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నారు. కాగా రెండు రోజుల క్రితం మూడు దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్న విషయం విదితమే. చెట్ల నరికివేతకు కారకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలపకు కొలతలు వేస్తున్న అధికారులు

దుమ్ముగూడెం : మండలంలోని జిన్నెలగూడెం, చిన్ననల్లబల్లి గ్రామాల్లో అటవీశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ రేంజర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం భారీగా కలపను స్వాధీనం చేసుకున్నారు. జిన్నెలగూడెం శివారులో అక్రమంగా దాచి ఉంచిన 12 టేకు దిమ్మెలను పక్కా సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. చిన్ననల్లబల్లి గ్రామం వద్ద చర్ల వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం నుంచి మూడు టేకు దిమ్మెలు స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. రెండు ఘటనల్లో పట్టుకున్న మొత్తం 15 టేకు దిమ్మెల విలువ రూ.3.18 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా చేశారు. ఈ దాడిలో దుమ్ముగూడెం రేంజర్ కనకమ్మ, డీఆర్వో శోభన్‌నాయక్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కోటేశ్వరరావు, వీర్రాజు, రాములు, రాఘవ, దుమ్ముగూడెం రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ అధికారుల ఉరుకులు.. పరుగులు

అదిగో.. ఇదిగో ఎలుగుబంటి అంటూ పుకార్లు



ఎలుగుబంటి జాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

చండ్రుగొండ : మండలంలో నాలుగురోజులుగా ఎలుగుబంటి ఉదంతం చర్చనీయాంశంగా మారింది. గడిచిన సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు మద్దుకూరు, చండ్రుగొండలో ఇద్దరు వ్యక్తులపై ఎలుగుబంటి దాడి చేసింది. రేంజర్ ఎల్లయ్య ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఎలుగుబంటి ఆచూకీ కోసం గాలింపు చేస్తున్నా జాడ దొరకలేదు. కాగా బుధవారం రాత్రి మద్దుకూరులో ఎలుగుబంటి వచ్చిందని రైతులు, గురువారం మద్దుకూరు ప్రాజెక్ట్ వద్ద ఎలుగుబంటి ఎదురుపడిందని ఓ వ్యక్తి, రావికంపాడు గ్రామంలోకి ఎలుగుబంటి ప్రవేశించిదని మరో వ్యక్తి సమాచారం ఇవ్వగా అటవీ అధికారులు పరుగులు పెట్టారు. ఆయా ప్రాంతాల్లో పరిశీలించి, గ్రామస్తులు చెప్పిన అడుగుజాడలు ఎలుగుబంటివి కాదని అటవీ అధికారులు కొట్టిపారేశారు. అటు ఇటు పరుగులు పెట్టాల్సి వస్తుండటంతో అధికారులకు తలనొప్పిగా మారింది. దారితప్పిన ఎలుగుబంటి గ్రామాల్లోకి వచ్చిన విషయం వాస్తవమేనని, కన్పిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని రేంజర్ ఎల్లయ్య చెప్పారు. అది తిరిగి అడవిలోకి వెళ్లే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### సుదిమళ్ల పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ

ఇల్లెందురూరల్: విధుల పట్ల బాధ్యతారాహిత్యంపై వివరణ కోరుతూ పంచాయతీరాజ్ యాక్ట్-2018లోని సెక్షన్ 43, 46, 47ను అనుసరించి మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ కార్యదర్శి నాగమణికి ఎంపీడీఓ బాలరాజు గురువారం మెమో జారీ చేశారు. సర్వసభ్య సమావేశపు తీర్మానాలపై సాధ్యాసాధ్యాలు తెలియజేయకపోవడం, సంతకం ఫోర్జరీ, విధులకు సెలవు పెట్టి ఎంపీడీఓ, ఎంపీఓ, డీపీఓ నంబర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వంటి కారణాలు మెమోలో పేర్కొన్నారు. 24 గంటల్లో ఎంపీడీఓ కార్యాలయంలో హాజరు కావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని మెమోలో పేర్కొన్నారు.

### భార్య, మామపై దాడి

ఇల్లెందు: భార్య, మామపై దాడి చేసిన ఘటనలో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇల్లెందు మండలం మామిడి గుండాల గ్రామపంచాయతీ రాజ్యాతండాలో నారాయణరెడ్డి, ఆయన కుమార్తె శారదలపై అల్లుడు ఉపేందర్‌రెడ్డి దాడి చేసి దూషించాడని నారాయణరెడ్డి సతీమణి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2006లో ఉపేందర్‌రెడ్డితో శారదకు వివాహం కాగా, కొంత కాలంగా వేధింపులకు గురి చేస్తుండటంతో, శారద తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఇంటికి వచ్చి దాడిచేసినట్లు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ టి.కరుణాకర్ తెలిపారు.

### వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ: వదినతో గొడవ పడి కోపంతో ఇంట్లోని వస్తువులను దగ్ధం చేసిన మరిదిపై పాల్వంచ పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కరకవాగుకు చెందిన నన్నెబోయిన వీరభద్రం అనే వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో అన్న భార్య వెంకటరమణతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై ఇంట్లోని టీవీ, డ్రెస్సింగ్ టేబుల్, బెడ్, ఇతర వస్తువులపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వస్తువులు పాక్షికంగా దగ్ధం కాగా, స్థానికులు వచ్చి అడ్డుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

### బావిలోకి దూసుకెళ్లిన కూలీల ఆటో

పలువురిని బయటకు తీసుకొచ్చిన రైతు



వ్యవసాయ బావిలో పడిన ఆటో

ముదిగొండ: మండలంలోని గంధసిరి సమీపాన వ్యవసాయ కూలీలతో వెళ్తున్న గురువారం సాయంత్రం అదుపు తప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. అయితే, ఎవరికీ ప్రాణాపాయం ఎదురు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.కోదాడ మండలం గోండ్రియాలకు చెందిన 16 మంది కూలీలు గంధసిరికి వచ్చి మిరపకాయలు కోశాక సాయంత్రం ఇంటికి బయలుదేరారు. అయితే, ఆటోలో కూలీలు కూర్చోగానే ఒక్కసారిగా బావిలోకి దూసుకెళ్లింది. దీంతో కూలీలు బావిలో పడగా కొందరు ఈదుతూ పైకి వచ్చారు. అనంతరం గంధసిరికి చెందిన రైతు ఫకీరు బావిలో దూకి మిగతా వారిని బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఒకరికి స్వల్పగాయాలు ఇతరులకు ఎలాంటి ప్రమాదం జరగలేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏన్కూరు: డాబా పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలో సూర్యతండాకు చెందిన ధరావత్ లాల్‌కోటి(35) జనవరి 26న తన ఇంటిపై డాబాపై నిద్రించాడు. అయితే, అర్ధరాత్రి మూత్రవిసర్జన దిగే క్రమంలో అదుపుతప్పి పడిపోయాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈమేరకు బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.రవి తెలిపారు.



## ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

## సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

## క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

## భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



**ఇస్లామాబాద్:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీఐపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

# మన గెలుపు హోరు వినిపించేనా!

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

## విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

| సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్ | తీవ్ర ఒత్తిడిలో టీమిండియా | ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం |
|---|---|---|

**సాక్షి, విశాఖపట్నం:** ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

### పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

### పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

### తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

### అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాతే ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

### బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్‌గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

## బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

**గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ**

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

## ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



**బెంగళూరు:** ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

# సినిమా

## గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

## చలో రష్యా

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.





● కమల్‌హాసన్

## మహేశ్ సినిమాలో?



● నాగార్జున

**సూ**పర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.

## సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

## వేసవిలో మ్యాచ్





● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తిశ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

## విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ–''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

## తెలుగు, నేపాలీ భాషల్లో...





● బ్రహ్మానందం

**ప్ర**ముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హాశ్య దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హాశ్యదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

**వి**నాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

## మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

**- దేవ్ జాంద్**



**ర**వితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ– ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.